

మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజాదర్బార్



సమస్యలను వింటున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఉరవకొండ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రికి విన్నవించారు. ఉరవకొండలో తాగు నీటి సమస్యను పలువురు మహిళలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వజ్రకరూరు మండలంలో బెస్త గంగపుత్ర సంఘం నాయకులు మంత్రిని కలిసి సమస్యపై వినతి పత్రాన్ని అందజేశారు. విద్యుత్ ఉద్యోగులు మంత్రిని కలిశారు. అనంతరం సావిత్రిబాయిపూలే మహిళా ఉపాధ్యాయ సంఘం కేలండర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

భక్తి తరంగం

వైభవంగా అశ్వత్థ నారాయణస్వామి తిరునాళ్ల

వేలాదిగా తరలివచ్చిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో అశ్వత్థ నారాయణస్వామి

పెద్దపప్పూరు, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. మాఘమాసం మొదటి ఆదివారం సందర్భంగా అశ్వత్థ నారాయణస్వామి, చక్రస్థాపిత భీమలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులు ఆలయ సమీపంలోని పెన్నానదిలో పుణ్యస్నానం ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు. స్వామివారిని తాడిపత్రి డివిజన్ ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి దంపతులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలాజీరాజు, ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, సీఐ వెంకటసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, పెద్దవడుగూరు ఎస్ఐ ఆంజనేయులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.




దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కేన్సర్ కలవరం

జిల్లాలో చాపకింద నీరులా మహమ్మారి

- స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభించిన ప్రభుత్వం
- 2,13,674 మందికి ప్రాథమిక పరీక్షలు
- రోగ నిర్ధారణకు జిల్లా ఆస్పత్రిలో టెస్టులు
- బాధితులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత చికిత్స



కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పదుల సంఖ్యలో నిర్ధారణ కేసులు

స్క్రీనింగ్ పరీక్షలలో అనుమానిత లక్షణాలు గుర్తిసే, అలాంటి వాళ్లను జిల్లా ఆస్పత్రిలోని కేన్సర్ ఓపీకి పంపుతున్నారు. ఇక్కడ వైద్యులు మళ్లీ పరీక్షలు నిర్వహించి వ్యాధి లక్షణాలా కాదా అని నిర్ధారిస్తున్నారు. ఇప్పటివరకు స్క్రీనింగ్‌లో అనుమానిత లక్షణాలు ఉన్నవారు జిల్లా ఆస్పత్రి ఓపీ కేంద్రంలో పరీక్షలు చేయించుకోగా పదుల సంఖ్యలో అవి కేన్సర్ లక్షణాలే అని నిర్ధారించారు. వైద్యశాఖ లెక్కల ప్రకారం ఇప్పటివరకు 45మందికి నోటి కేన్సర్, 57మందికి రొమ్ము కేన్సర్, 40మందికి సర్వైకల్ కేన్సర్ ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారించారు.



అనంతపురం టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేన్సర్... ఈ పేరు వింటే చాలు ఆరోగ్యంగా ఉన్నవారు సైతం బెంబేలెత్తుతారు. ఈ రోగం వచ్చిందంటే పైకి పోవడమేనని చాలా మంది భయపడతారు. సామాన్యులకు ఈ మహమ్మారి వచ్చిందంటే ఉన్న ఆస్తిపాస్తులను అమ్ముకుని వైద్యం చేయించుకున్నా, మనిషి బతకడం కష్టమవుతోంది. ఇంతటి భయంకరమైన వ్యాధి ఇటీవల జిల్లాలో విస్తృతమవుతోంది. జిల్లా వ్యాప్తంగా కేన్సర్ కేసులు ఇటీవల బాగా పెరిగిపోయాయి. నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ ఇలా రకరకాల పేర్లతో మనిషి ప్రాణాలను హరిస్తోంది. పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా ప్రజలందరినీ కలవర పెడుతోంది. జిల్లాలో చాపకింద నీరులా మహమ్మారి విస్తరిస్తోందని ఇటీవల బయటపడుతున్న కేసులే చెబుతున్నాయి.

3007 మందికి అనుమానిత లక్షణాలు

ప్రభుత్వం కేన్సర్ నివారణకు రాష్ట్ర వ్యాప్తంగా కేన్సర్‌పై విజయం...స్క్రీనింగ్‌తో సాధ్యం, ముందస్తు పరీక్ష.. కేన్సర్ నుంచి రక్ష అనే నినాదాలతో అందరికీ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపడుతోంది. ఇందులో భాగంగా అనంత జిల్లాలోనూ గతేడాది నవంబరు 14 నుంచి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికి ఈ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 18,58,056మందికి స్క్రీ నింగ్ పరీక్షలు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 76 పీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీల పరిధిలో జిల్లాలో ఇప్పటివరకు 2,13,674మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఇందులో 3007మందికి కేన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు క్షేత్రస్థాయి పరీక్షల్లో వైద్యసిబ్బంది తేల్చి, వివరాలు జిల్లా వైద్యశాఖకు పంపారు.

వేలాది మందికి కేన్సర్ లక్షణాలు

జిల్లాలో వేలాది మందికి కేన్సర్ లక్షణాలు బయట పడుతుండటంతో ప్రజలు, వైద్యులలో ఓ రకమైన ఆందోళన మొదలైంది. గ్రామస్థాయిలో ఉన్న పీహెచ్‌సీలు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న యుపీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలలో ఈపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలలో 3007మందికి కేన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు బయటపడటం అందరిలో ఆందోళన మొదలైంది. పట్టణప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాలలోనే అధికంగా కేన్సర్ లక్షణా లు ఉన్నవారు ఉండటం మరింత ఆందోళ న కలిగిస్తోంది. కంబదూరు మండలం నూతిమడుగు పీహెచ్‌సీ పరిధిలో 111మందికి నోటి కేన్సర్, 11 మందికి రొమ్ము కేన్సర్, 26మందికి సర్వైకల్ కేన్సర్, అనంతపురంరూరల్ పరిధిలోని కురుగుంట పీహెచ్‌సీ పరిధిలో 52మందికి నోటి కేన్సర్, 42మందికి రొమ్ము కేన్సర్, 30మందికి సర్వైకల్ కేన్సర్, కూడేరు పీహెచ్‌సీ పరిధిలో 30మందికి నోటి కేన్సర్, 09మందికి రొమ్ము కేన్సర్, 22మందికి సర్వైకల్ కేన్సర్, కణేకల్లు మండలం గరుడచేడు పీహెచ్‌సీ పరిధిలో 23మందికి నోటి కేన్సర్, 15మందికి రొమ్ము కేన్సర్, 20మందికి సర్వైకల్ కేన్సర్, శింగనమల మండలం తరిమెల పీహెచ్‌సీ పరిధిలో 19మందికి నోటి కేన్సర్, 19మందికి రొమ్ము కేన్సర్, 75మందికి సర్వైకల్ కేన్సర్, బుక్కరాయసముద్రం పీహెచ్‌సీ పరిధిలో 23 మందికి నోటి కేన్సర్, 34మందికి రొమ్ము కేన్సర్, 10మందికి సర్వైకల్ కేన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు స్క్రీనింగ్ పరీక్షలలో గుర్తించారు. ఇతర పీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలు, సీహెచ్‌సీల పరిధిలో కూడా పదుల సంఖ్యలోనే కేన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నవారు ఉన్నట్లు వైద్యశాఖ వర్గాలు తెలుపుతున్నాయి.

ఆయా ఆస్పత్రుల పరిధిలో అధికంగా అనుమానిత లక్షణాలు ఉన్నోళ్లు ఇలా..

ఆస్పత్రి సెంటర్	నోటి కేన్సర్	రొమ్ము కేన్సర్	సర్వైకల్ కేన్సర్
బుక్కరాయసముద్రం	23	34	10
కురుగుంట	52	42	30
నూతిమడుగు	111	11	26
పి.కొత్తపల్లి	08	04	57
పెద్దపప్పూరు	13	08	44
రాకెట్ల	37	37	29
రుద్రంపేట	13	27	32
తరిమెల	19	19	75
చెట్నేపల్లి	17	03	36
పాతకోట	07	14	36
తాడిపత్రి	13	13	12
ఆత్మకూరు	11	06	11
ఆవులదట్ల	17	04	20
బి.పప్పూరు	10	03	21
బేతపల్లి	12	17	13
బొమ్మనహాళ్	27	12	19
ఎద్దులపల్లి	20	26	17
గార్లదిన్నె	21	08	15
గరుడచేడు	14	07	23
గుమ్మఘట్ట	23	15	20
కంబదూరు	02	15	19
కూడేరు	30	09	22
ముద్దినాయనపల్లి	11	16	26
నాగసముద్రం	32	27	20
పి.కొకుంట్ల	10	18	12
పెద్దవడుగూరు	06	14	41
పుట్లూరు	28	13	17
రాయలచెరువు	07	22	06
శెట్టూరు	10	15	14
తాళ్లకేర	32	08	20
తిమ్మగానిపల్లి	21	06	13
శ్రీనివాసపురం,	25	10	07
వజ్రకరూరు	23	02	20
ఎనుములదొడ్డి	32	12	16
ఎర్రగుంట్ల	13	15	17
యర్రగుంట్ల	11	18	23

ఇవి అనుమానిత కేసులే...



ప్రభుత్వం కేన్సర్‌ను అరికట్టాలనే ముందస్తు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. అక్కడ అనుమానిత లక్షణాలు ఉన్నవారిని వైద్య సిబ్బంది గుర్తిస్తుంది. వారిని డాక్టర్ల వద్దకు పంపి అవసరమైన పరీక్షలు చేయిస్తాం, అక్కడ కేన్సర్ అని నిర్ధారిస్తే, బాధితులను కర్నూలు , హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు ఇలా ఎక్కడ కేన్సర్‌కు చికిత్స ఉంటుందో అక్కడకు రెఫర్ చేస్తాం. కేన్సర్ బాధితులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తున్నాం. ఇపుడు గుర్తించిన కేసులు అనుమానితకేసులే. పూర్తిస్థాయిలో సమాచారం రావాలంటే వారందరికి మళ్లీ డాక్టర్లు పరీక్షలు చేయాల్సి ఉంది.

- డాక్టర్ ఈబీదేవి, డీఎంహెచ్ఓ

ప్రతి ఒక్కరికీ కేన్సర్ స్క్రీనింగ్



ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లాలో 18ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో 18,58,056 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. జనవరి 29 నాటికి 2,13,674మందికి పరీక్షలు నిర్వహించాం. అందులో అనుమానిత లక్షణాలు ఉన్నవారందరిని సంబంధిత డాక్టర్ల వద్దకు పంపించి మళ్లీ పరీక్షలు చేయిస్తాం. జిల్లాలో మరో ఐదు నెలలు పాటు ఈ కేన్సర్ పరీక్షలు కొనసాగుతాయి.

-డాక్టర్ నారాయణస్వామి, ప్రోగ్రామ్ ఆఫీసర్

వ్యవసాయ మార్కెట్ కమిటీ రిజర్వేషన్లు ఖరారు



అనంతపురంరూరల్, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. జిల్లాలో తొమ్మిది మార్కెట్ యార్డులున్నాయి. నెల రోజుల కిందట జిల్లాలోని మార్కెట్ కమిటీల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు సంబంధిత ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. రోస్టర్ ఇతరత్రవాటిని పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా అధికారులు రిజర్వేషన్లు తయారు చేసి పంపించారు. ఆమేరకు మార్కెట్ కమిటీల రిజర్వేషన్లు ఖరారైనట్లు సమాచారం. అనంతపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఓసీ(జనరల్)కి ఖరారైనట్లు తెలిసింది. గుంతకల్లు మార్కెట్ కమిటీ ఎస్టీ(మహిళ), గుత్తి మార్కెట్ కమిటీ బీసీ(మహిళ), కళ్యాణదుర్గం మార్కెట్ కమిటీ బీసీ(మహిళ), రాయదుర్గం మార్కెట్ కమిటీ ఓసీ(జనరల్), శింగనమల మార్కెట్ కమిటీ బీసీ(మహిళ), తాడిపత్రి మార్కెట్ కమిటీ ఎస్సీ(మహిళ), ఉరవకొండ మార్కెట్ కమిటీ ఓసీ(జనరల్), రాప్తాడు మార్కెట్ కమిటీ ఓసీ(జనరల్)గా ఖరారయ్యాయి.

ఉపాధితో పేదరిక నిర్మూలన: పీడీ



ఉపాధి దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన, గ్రామీణ ప్రాంతాలలో పేదల జీవనోపాధుల పెంపునకు ఉపాధి హామీ పథకం ఎంతో తోడుగా నిలుస్తోందని డ్వామా పీడీ సలీంబాషా పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధి పథకాన్ని ప్రారంభించి 19సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానిక డ్వామా పీడీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సిబ్బందికి పంచారు. కార్యక్రమంలో డ్వామా అదనపు పీడీ సుధాకర్‌రెడ్డి, జేఏసీ అధ్యక్షుడు గండికోట రామాంజినేయులు, గౌరవాధ్యక్షుడు చెన్నకేశవ, ఏపీఓలు ఓబన్న, మురళీకృష్ణ, తులసిప్రసాద్, ఈసీలు మురళీ, శివరామకృష్ణ, విజయభాస్కర్, ఓంప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాయా మశ్చీంద్ర..!

లేని ట్యూటర్లను ఉన్నట్లు చూపిన అధికారి

రూ.ఐదు లక్షలకుపైగా బొక్కేసిన వైనం

విధుల విషయంలోనూ అలసత్వమే..

ఎస్సీ వెల్ఫేర్‌లో ఓ పర్యవేక్షణాధికారి తీరు



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమశాఖలోని ఓ పర్యవేక్షణాధికారి మాయా మశ్చీంద్ర అవతారం ఎత్తాడు. లేనివారిని ఉన్నట్లు చూపి లక్షల రూపాయలు మెక్కేశాడు. ఎవరైనా తన అవినీతికి అడ్డొస్తున్నట్లు తెలిసే చాలు తనకు అనుకూలురైన కొన్ని సంఘాలను వారిపైకి ఉసిగొల్పుతున్నట్లు సమాచారం. అయితే ఈయన ఆగడాలు పెరిగిపోవడం, విధుల పట్ల అలసత్వం వహించడంతో అవినీతి వ్యవహారం బహిర్గతమైంది.

కొట్టేసిందిలా..!

ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలోని ఓ డివిజన్‌కు ఆయన పర్యవేక్షణాధికారిగా వ్యవహరిస్తున్నారు. ఆ అధికారికి మరో డివిజన్‌కు ఓ మూడు నెలల పాటు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన డివిజన్‌లో దాదాపు వసతిగృహాలకు ట్యూటర్లు లేనట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆ డివిజన్‌లోని కొందరు వార్డెన్లను తనకు అనుకూలంగా మలుచుకొని ట్యూటర్లు లేకపోయినా ఉన్నట్లు వారి ద్వారా ఫైలును ముందుకు నడిపినట్లు సమాచారం. దీనికి తోడు డీడీఓ అధికారాలు ఆ అధికారికి ఉండటంతో పని సాఫీగా జరిగిపోయినట్లు తెలుస్తోంది. ఆ డివిజన్‌లో దాదాపు సంవత్సరానికిపైగా ట్యూటర్లు లేనట్లు సమాచారం. అయినా సంవత్సర నుంచి ఉన్నట్లు చూపాడు. దీనికి తోడు గతేడాది పెండింగ్ ట్యూటర్ల జీతభత్యాలకు సంబంధించి నిధులు రావడం ఆ అధికారి అక్రమార్జనకు మార్గం సులువైంది. ఇన్‌చార్జ్‌నే కదా అనుకున్నాడో ఏమోగానీ... నిధులు రావడం, ట్యూటర్ల బిల్లుల ఫైళ్లు రెడీ చేసుకోవడంతో సంతకాలు చేసి ట్రెజరీకి పంపేశాడు. ట్రెజరీలోని కొందరు అధికారులు ఆ అధికారికి సహకరించినట్లు తెలుస్తోంది. దీంతో ట్యూటర్లకు సంబంధించిన బిల్లులు దాదాపు రూ. 5 లక్షలకుపైగా గుట్టుచప్పుడు కాకుండా నొక్కేసినట్లు సమాచారం. ఆ పర్యవేక్షణాధికారి ట్యూటర్ల బిల్లులు నొక్కేయడంలో 70

ఆ ఇద్దరు వార్డెన్లదే కీలక పాత్ర..

శాతం పాత్ర వహిస్తే... మూడు నెలలపాటు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన డివిజన్‌లో ఓ వార్డెన్, తన రెగ్యులర్ డివిజన్‌లో ఒక వార్డెన్ మిగిలిన 30 శాతం పాత్ర వహించినట్లు సమాచారం. రెండు డివిజన్‌లను ఆ అధికారి పర్యవేక్షిస్తుండటంతో స్వామి భక్తి చాటుకున్నారో... లేక భయంతో చేశారోగానీ ఆ పర్యవేక్షణాధికారికి ట్యూటర్ల సొమ్మును డ్రా చేసి ఇచ్చినట్లు సమాచారం. ఈక్రమంలోనే తాను ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న డివిజన్‌కు రెగ్యులర్ అధికారి వచ్చారు. దీంతో తనకేమీ తెలియదన్నట్లుగా మిన్నకుండిపోయాడు. అయితే ఆ పర్యవేక్షణాధికారికి... కొందరు వార్డెన్లు, అధికారులకు పంపకాల్లో తేడాలు వచ్చాయి. దీంతో ఆ పర్యవేక్షణాధికారి కొందరు సంఘాల నేతలను పంపి బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం.

అనంతలోనే తిష్ట

ఆ పర్యవేక్షణాధికారి విధులు నిర్వర్తించాల్సిన డివిజన్‌లో ఒక్కరోజంటే ఒక్కరోజు కనబడకపోవడం విమర్శలకు తావిస్తోంది. నిత్యం అనంతలో తిష్టవేసి విధులకు డుమ్మా కొడుతున్నట్లు సమాచారం. తన డివిజన్‌లో ఆ అధికారి కార్యాలయంలో ఉండరన్న విమర్శలు ఉన్నాయి. ఎవరైనా ఎక్కడున్నారని ఆరా తీస్తే... ఫీల్డ్‌వర్క్‌లో ఉన్నాను... లేదా వసతిగృహాల తనిఖీలకు వచ్చానంటూ ఆ శాఖ అధికారులకే మస్కా కొట్టి యథేచ్ఛగా అనంతలో తన వ్యక్తిగత పనులు చూసుకుంటున్నట్లు సమాచారం. ఇదంతా ఆ శాఖ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.

ఎట్టకేలకు..

నాగసముద్రం రోడ్డుకు మోక్షం

ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

కూటమి పాలనలో రహదారి నిర్మాణం

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అధ్వానంగా ఉన్న మండలంలోని నాగసముద్రం గ్రామానికి వెళ్లే రోడ్డుకు కూటమి ప్రభుత్వంలో మోక్షం లభించింది. నడవడానికి కూడా వీలులేని రీతిలో అధ్వానంగా ఉన్న రోడ్డుతో గ్రామస్థులు ఇన్నాళ్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధర్మవరం నుంచి ఎన్ఎస్‌గేటుకు వెళ్లే ప్రధాన రహదారి పక్క నుంచి గ్రామంలోకి వెళ్లే దాదాపు రెండు కిలో మీటర్ల రోడ్డు కంకరతేలి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. ఈ రోడ్డు దుస్థితి గురించి గత వైసీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో ఐదేళ్ల పాటు కంకర తేలి, గుంతలమయమైన రోడ్డుపై ఇబ్బందులు పడుతూనే గ్రామస్థులు ప్రయాణం కొనసాగించారు. గత ఏడాది కొలువుదీరిన కూటమి ప్రభుత్వం నాగసముద్రం రోడ్డుకు మోక్షం కల్గించింది. ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి ఏపీఆర్ఆర్‌పీ పథకం కింద రూ.1.41 కోట్లతో నూతన తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో తమ కష్టాలు ఇన్నాళ్లకు తీరాయని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత నూతనంగా నిర్మించి తారు రోడ్డును సోమవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు తెలిపారు.



నాడు



నేడు

క్రైం కార్నర్

గంటల వ్యవధిలోనే నిందితుడి అరెస్ట్

- ఏడేళ్ల బాలుడిని కాపాడిన ధర్మవరం పోలీసులు

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): భార్య, అత్తపై దాడికి పాల్పడి ఏడేళ్ల కుమారుడిని ఎత్తుకెళ్లిన నిందితుడిని ధర్మవరం పోలీసులు గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేశారు. ధర్మవరం మండలం బడన్నపల్లికి చెందిన తన భార్య కాపురానికి రాలేదని ఆమెపైనా, అత్తపైనా కడప జిల్లా వేముల మండలం భూమయ్యగారిపల్లి చెందిన బ్రహ్మయ్యఆచారి వేటకొడవలితో దాడిచేసిన సంగతి విదితమే. అంతటితో ఆగకుండా తన కుమారుడిని ఎత్తుకుపోవడంతో ఆందోళన చెందిన బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్పీ రత్న.. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్‌తో ప్రత్యేక టీంను ఏర్పాటుచేశారు. డీఎస్పీ తక్షణమే రంగంలోకి దిగి కడప జిల్లా పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక పోలీసుల సహకారంతో నిందితుడు బ్రహ్మయ్యఆచారిని భూమయ్యగారిపల్లిలో గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న ఏడేళ్ల బాలుడిని కాపాడారు. బాలుడిని సురక్షితంగా కాపాడినందుకు డీఎస్పీ హేమంత్‌కుమార్, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన డీజీపీ రివార్డు ప్రకటించారు.

పింఛన్ పంపిణీలో గొడవ

- సిబ్బంది నిర్లక్ష్యం
- ఓ వర్గంపై మరో వర్గం దాడికి యత్నం
- గొల్లపల్లి ఎస్సీ కాలనీకి భారీగా చేరిన పోలీసులు



గ్రామస్థులకు సర్దిచెబుతున్న పోలీసులు

గాండ్లపెంట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పింఛన్ పంపిణీ సందర్భంగా మండలంలోని గొల్లపల్లిలో గొడవ చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యం గ్రామంలో గొడవలకు దారితీసిందని పింఛన్‌దారులు అంటున్నారు. గొల్లపల్లి ఎస్సీ కాలనీలో శనివారం పింఛన్ పంపిణీ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ఇవ్వాల్సిన సిబ్బంది ఒకచోట కూర్చుని పంపిణీ చేశారు. ఓ వ్యక్తి ఆధార్ కార్డులను సేకరించి వరస క్రమంలో పంపిణీ మొదలు పెట్టారు. ఆధార్ కార్డులు తీసుకున్న ఆ వ్యక్తి కార్డులను తారుమారు చేయడంతో గొడవ మొదలయింది. తరువాత గ్రామస్థులు సర్ది చెప్పారు. దీనిపై ఒక వర్గం వారు శనివారం రాత్రి భారీస్థాయిలో మరోవర్గంపై దాడికి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు గొడవలు జరగకుండా అడ్డుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో మరింత వివాదం కాకుండా ఎన్పీకుంట, తలుపుల, కదిరి ఎస్ఐలతోపాటు, ఆయా పోలీస్‌స్టేషన్ల సిబ్బందిని గొల్లపల్లి పంపించి బందోబస్తు నిర్వహించారు. ఇరువర్గాలకు పోలీసులు సర్దిచెప్పడంతో గొడవలు సద్దుమణిగాయి. ఆదివారం సీఐ నాగేంద్ర ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి గ్రామంలో ఎలాంటి గొడవలకు దిగుకూడదని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పింఛన్ పంపిణీ సిబ్బంది నిర్లక్ష్యంవల్లే గొడవలు వస్తున్నట్లు ప్రజలు అంటున్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు వలీబాషా, నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

నగర శివారులో హత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని హార్మోన్‌సిటీ పక్కనున్న చింతతోపులో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన ఎరుకల కాశప్ప(40)మృతదేహం చింతతోపులో లభ్యమైంది. అతడి మొహంపై బండరాతితో మోదడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికులు అటుగా వెళ్లి ఆ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని రూరల్ సీఐ శేఖర్, నాలుగో పట్టణ సీఐ సాయినాథ్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతుడు కక్కలపల్లిలోని టమోట మండీలో ప్యాకింగ్ లేబర్‌గా పనిచేస్తుండేవాడు. సంఘటన జరిగిన స్థలం అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందా...?నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వస్తుందా..?అనే విషయంలో సందిగ్ధం తలెత్తింది. రాత్రి 8గంటల వరకు కేసు ఎవరిదనే విషయం తేలలేదు. చివరకు రూరల్ పోలీసులు ఆ కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య సౌభాగ్య కొడుకు, కుమార్తె సంతానం. మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): భార్యకు క్యాన్సర్ నయం కాకపోవడం.. కుటుంబంలో కలహాలు తలెత్తడం లాంటి సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ విశ్రాంత ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డారు. అనంతపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రూరల్ మండల పరిధిలోని పాపంపేట పోస్టల్ శాఖలో పనిచేసి రిటైర్డ్ అయిన శ్రీనివాసులు (67) తన కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. ఈయన భార్య వెంకటసుబ్బమ్మ గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతుండేది. వ్యాధి నయం కాలేదు. దీనికి తోడు కుటుంబంలో కలహాలు తలెత్తడంతో మానసికంగా కుంగిపోయిన శ్రీనివాసులు శనివారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు అనంతపురం రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గంజి పడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న చిన్నారి మృతి చెందింది. పదిరోజుల క్రితం నగరంలోని రాణినగర్‌కు చెందిన మునీర్‌బేగం తన ఏడాదిన్నర వయసున్న చిన్నారితో ఇంట్లో ఉండగా ...పక్కింట్లో ఉంటున్న హర్షియా ఆడిస్తానని చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లింది. కొంతసేపటికే వేడిగా ఉన్న గంజి పడి తీవ్రగాయాలకు గురైంది. చిన్నారిని స్థానికంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది.

దైవదర్శనం కోసం..
కొండ ఎక్కుతూ వృద్ధుడి మృతి



రుషింగమయ్య కొండ మీద మృతి చెందిన గొర్ల ప్రకాశ్‌రావు

శింగనమల ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం కోసం కొండ ఎక్కుతూ గొర్ల ప్రకాశ్‌రావు(67) అనే వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందారు. బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం గుల్జార్‌పేటకు చెందిన ఆర్యవైశ్య గొర్ల ప్రకాశ్‌రావు తన భార్య రమాసుందరి, అన్న కుమారుడు కిరణ్‌తో కలసి ఆదివారం శింగనమల వద్ద ఉన్న పురాతన రుషింగమయ్య కొండకు దర్శనం కోసం వెళ్లారు. కొండలో 3 కిలోమీటర్ల వెళ్లిన తరువాత గుండెపోటు రావడంతో కూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు, 108కు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి వెళ్లేలోపే ప్రకాశ్‌రావు మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకు వెళ్లడానికి కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతుండడంతో పోలీసులు, 108 సిబ్బంది మానవత్వం చాటుకున్నారు. కానిస్టేబుళ్లు నరేష్, రామాంజనేయులు, సాయినాథ్, 108 సిబ్బంది శివ, కేశవ్ మృతదేహాన్ని కొండ నుంచి ఆసుపత్రికి తీసుకు వచ్చారు. వారిని శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ అభినందించారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రమే ధ్యేయం

- క్రీడాంధ్రప్రదేశ్‌గా మారుస్తాం - శాప్ చైర్మన్
- స్టేడియం నిర్మిస్తాం : ఎమ్మెల్యే
- ఉత్సాహంగా రన్‌లో పాల్గొన్న యువత



'సే నో టూ డ్రగ్స్' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, శాప్ చైర్మన్, అహుడా చైర్మన్, రైతులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో వైసీపీ రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చిందని.. డ్రగ్స్ రహిత రాష్ట్రమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. 'సే నో టూ డ్రగ్స్, స్పోర్ట్స్ ఏపీ సాధన' నినాదంతో 'అనంతపురం కోసం పరుగు' కార్యక్రమాన్ని శాప్, ఈగల్, అహుడా, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్, వీవైబ్ సంస్థలు సంయుక్తంగా ఆదివారం వీ రన్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన వేదిక వద్ద అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, ఏఎస్పీ మల్లికార్జునవర్మ యువతతో



రన్‌లో ఎమ్మెల్యే, శాప్ చైర్మన్, అహుడా చైర్మన్

కలిసి స్టెప్పులేసి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా వాటి ఆనవాళ్లు ఏపీ నుంచే ఉండేవని, వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న భారీ ఔట్‌డోర్ స్టేడియం నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో యథేచ్ఛగా గంజాయి పాఠశాలల నుంచి కళాశాలల వరకు పాకిందని, దీంతో యువత జీవితాలను బలిచేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో లోకేష్‌కు పలు జిల్లాల ప్రజలు గంజాయిని నియంత్రించాలని కోరారని...అప్పుడే 'గంజాయి వద్దు బ్రో' అనే నినాదాన్ని ఇచ్చారని...ఇప్పుడు అదే అమలు చేస్తున్నామని అన్నారు. జిల్లాలో స్టేడియం నిర్మించి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సాహిస్తామని తెలిపారు. క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన క్రీడాపాలసీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అహుడా చైర్మన్ టీసీ వరుణ్ మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు యువత బానిసలు కాకుండా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఏఎస్పీ మల్లికార్జునవర్మ మాట్లాడుతూ.. గంజాయి రహిత సమాజస్థాపనకు యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సే నో టూ డ్రగ్స్... కార్యక్రమాన్ని శాప్, ఎలైట్ యాంటీనార్కటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్-ఈగల్, అహుడా, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ సహకారంతో నిర్వహించడం సంతోషంగా ఉందని వీ వైబ్ సంస్థ అధినేత సజ్జ రాఘవీణ తెలిపారు. అనంతరం జెండా ఊపి ప్రారంభించిన 10కె, 5కె, 3కె రన్‌లో పాల్గొన్న యువతను అభినందించారు. కార్యక్రమంలో జైకిసాన్ ఫౌండేషన్ చైర్మన్ ఓబుళేసు, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సుధాకర్, ఎస్‌కే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హరికృష్ణ, డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, కోచ్‌లు అనిల్‌కుమార్, ఆలీ, నరేష్‌కుమార్, లక్ష్మి, సంధ్య, జెబవుల్లీ, రాఘవేంద్ర, గ్రీన్ ఆర్మీ ఏజీ అనిల్‌కుమార్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి
తిరునాళ్ల ప్రారంభం

గార్లదిన్నె, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా పేరుగాంచిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాళ్ల ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది మాఘమాసంలో స్వామి తిరునాళ్ల నాలుగు వారాల పాటు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది మాఘమాసం మొదటి ఆదివారం తిరునాళ్ల ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులు తెల్లవారుజామున స్వామిని వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి ఏకవార



108 శివలింగాలకు ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

రుద్రాభిషేకం, సహస్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామికి బియ్యం, బేడలతో పాటు వివిధ రూపాల్లో కానుకలు సమర్పించుకున్నారు. ఆలయం అవరణంలో ఉన్న 108 శివలింగాలను, సాయిబాబాలను భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి, భాస్కర్ ఫర్టిలైజర్ ఎండీ విజయ్‌భాస్కర్ దంపతులు ప్రసాదం అందచేశారు.

రేపు బూదగవిలో రథసప్తమి వేడుకలు

ఉరవకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి గ్రామంలో వెలసిన సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకల నిర్వహణకు ఆలయ కమిటీ సన్నాహాలు చేస్తోంది. దక్షిణముఖంగా ఉన్న ఏకైక సూర్యుడి ఆలయంగా గుర్తింపు పొందింది. సూర్యుడి ఆలయాల్లో రాష్ట్రంలో రెండోదిగా, దక్షిణభారతదేశంలో మూడోదిగా ప్రశస్తి పొందింది. ఈ ఆలయాన్ని 13వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ ఆలయంలో పూజ, యజ్ఞం, సూర్య నమస్కారాలు, చేసినా, చేయించినా సర్వ రోగ నివారణ జరుగుతుందని, మృత్యు భయం ఉండదని భక్తుల విశ్వాసం. ఆలయంలో మూలవిరాట్‌కు సాష్టాంగ నమస్కారం చేస్తున్నట్లు ఉన్న హనుమంతుడి రూపం నేలపై ఉండడం ఇక్కడ విశేషం. ఇది రెండు ఆలయాల సముదాయం. దీనికి తూర్పునకు అభిముఖంగా రామలింగేశ్వరాలయం, ఎడమవైపున దక్షిణముఖంగా సూర్యనారాయణ స్వామి దేవాలయం నిర్మించారు. ఈ రెండు ఆలయాలను కలుపుతూ వాటికి ఎదురుగా నాలుగు స్తంభాలతో మండపం నిర్మించారు. మాఘ శుద్ధ సప్తమి రోజే రథసప్తమి. ఆ రోజునే సూర్య జయంతిని జరుపుకుంటారు. సూర్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం మహాగణపతిపూజ, గోపూజ, గంగపూజ, కలశస్థాపన, దీక్షహోమాలు నిర్వహిస్తారు. 4వ తేదీన రథసప్తమి సందర్భంగా ఛాయా ఉషసమేత సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవం, అష్టోత్తర శత క్షీర కుంభాభిషేకం, మహాసౌర అరుణపూర్వక సూర్యనమస్కారాలు నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.



సూర్యభగవానుడి మూలవిరాట్



సూర్యనారాయణస్వామి ఆలయం

200 గ్రాముల గంజాయి స్వాధీనం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ పోలీసులు ఆదివారం పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. జేఎన్‌టీయూ సమీపంలోని శ్మశాన వాటిక వద్ద షికారి విజయ్ అనే వ్యక్తి నుంచి 200 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆత్మకూరు మండలం గొరిదిండ్ల తండాలో ఇద్దరు వ్యక్తుల నుంచి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సునంద, ఎస్ఐ జయనరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ రెప్‌ల కార్యవర్గం ఎన్నిక

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మెడికల్, సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మెడికల్ రెప్స్ యూనియన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా విజయనాయుడు, ఉపాధ్యక్షులుగా మంజునాథ్, నరేంద్ర, సహాయ కార్యదర్శులుగా కదిరప్ప, రామాంజనేయులును ఎన్నుకున్నారు. ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదర్శరెడ్డి, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి, లింగమయ్య పాల్గొన్నారు.

మద్దలచెరువులో ఎలుగుబంట్ల సంచారం

కనగానపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దలచెరువు గ్రామ వద్ద శనివారం రాత్రి రెండు ఎలుగుబంట్లు హల్‌చల్ చేశాయని రైతులు తెలిపారు. గ్రామ శివారులోని మద్దలచెరువు నుంచి భానుకోట మధ్య ఉన్న హంద్రీనీవా కాలువ బ్రిడ్జి కింద దాగి ఉన్నాయన్నారు. గత నెల రోజులుగా రెండు ఎలుగు బంట్లు గ్రామ సమీపంలో సంచరిస్తున్నాయని వివరించారు. బ్రిడ్జి కింద ఎలుగు బంట్లు దాగున్నాయని ఆదివారం గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. అయినప్పటికీ అధికారులు ఏమీ పట్టించుకోలేదని తెలిపారు. పొలాలకు వెళ్లాలంటే రైతులు భయపడుతున్నారు.




బ్రిడ్జికింద దాగి ఉన్న ఎలుగుబంట్లు

ఉద్యోగ విరమణ ప్రయోజనాలు ఎప్పుడో..?

- వైసీపీ పాలనలో రిటైర్డ్ ఉద్యోగులకు మొండిచేయి
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

ధర్మవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రాష్ట్ర ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచింది. విశ్రాంత ఉద్యోగులకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు గతఐదేళ్ల కాలంలో అందలేదంటూ పలువురు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలు అందేనా అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాల కోసం కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాన్ని 1, 2 తేదీల్లో అందిస్తోంది. అదేవిధంగా తమకు అందాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు పదవీవిరమణ ఉద్యోగులు కోరుతున్నారు. గత ప్రభుత్వ విధానాలతో విసిగిపోయిన చాలా మంది స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్ఎస్) చేసిన సంఘటనలు ఉన్నాయి. వారిని మినహాయిస్తే గత ప్రభుత్వంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు నేటికి అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. 30 ఏళ్లలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని వచ్చేజీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తూ పదవీ విరమణ సమయంలోవారు వచ్చే డబ్బుతో తమ ఆశలు తీరుతాయని ఎంతో ఆతృతగా ఉంటారు. వచ్చే డబ్బుతో పిల్లల చదువులు, వివాహాలు, సొంతిటి నిర్మాణం నెరవేర్చుకోవాలని కలలు కంటుంటారు. ఆ కలలను గత ప్రభుత్వం కల్లలు చేసిందని విశ్రాంత ఉద్యోగులు మండిపడుతున్నారు.



బెనిఫిట్స్ కోసం ఎదురు చూస్తున్నా



నేను గత ఏడాది ఏప్రిల్‌లో పదవీ విరమణ పొందాను. నాకు ఇప్పటి వరకు పీఎఫ్, గ్రాట్యుటీ, సీసీఎస్ మాత్రమే అందాయి. మిగిలిన బెనిఫిట్స్ ఇంతవరకు అందలేదు. నేను ఉద్యోగంలో చేరినప్పుడు 10డీ ఫారంలో కొన్ని అంశాలను తప్పుగా పొందుపరిచారు. వాటిని సరిదిద్దుకోవడానికి కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు. నాలాంటి వారు ఉమ్మడి జిల్లాలో ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బెనిఫిట్స్ అందేవిధంగా చూడాలి.

- సూరీడు, ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్

జిల్లాలో స్టేడియం నిర్మిస్తాం

- శాప్ చైర్మన్, ఎమ్మెల్యే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కచ్చితంగా భారీ ఔట్‌డోర్ స్టేడియం నిర్మిస్తామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన 'అస్తవ్యస్తం' అనే కథనానికి వారు స్పందించారు. వీ రన్‌లో పాల్గొన్న శాప్ చైర్మన్, ఎమ్మెల్యే స్పందిస్తూ... గత వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన క్రీడాశాఖను గాడిలో పెడతామన్నారు. ఎన్నో ఏళ్ళుగా జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న భారీ ఔట్‌డోర్ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్నామని తెలిపారు. ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల పేరుతో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన గత డీఎస్‌డీఓ నరసింహారెడ్డినుంచి ప్రతి పైసా కక్కిస్తామని పేర్కొన్నారు. నార్పల స్టేడియంలో క్రీడాసామగ్రి క్రీడాకారులకు పంపిణీ చేస్తామని వివరించారు. కోచ్‌ల నియామకంపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

వడ్డె ఓబన్నను స్ఫూర్తిగా తీసుకోవాలి

- విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే పరిటాల సునీత



వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్నను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పేరూరు గ్రామంలో వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ సత్యసాయిజిల్లా అధ్యక్షుడు అంజనప్పకు వడ్డెర కులస్థులు ఘన స్వాగతం పలికి భారీ ఊరేగింపు నిర్వహించారు. వడ్డెర మహిళతో కలిసి పరిటాల సునీత కలశం ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ...బ్రిటీష్ వారి ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు వడ్డె ఓబన్న అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సైనిక అధ్యక్షుడిగా పనిచేశారని, రైతులపై బ్రిటీష్ వారు విధించి పన్నులకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తుచేశారు. 39 ఏళ్ల వయస్సులోనే వీరమరణం పొందారన్నారు. టీడీపీ వడ్డెర్లకు మొదటి నుంచి రాజకీయ ప్రాధాన్యం కల్పించిందన్నారు. వడ్డెర్లు మరింత రాజకీయంగా, ఆర్థికంగా ముందుకువెళ్లాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులతో పాటు వడ్డెర సంఘం నాయకులు, కులస్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే శరణ్యం



మాట్లాడుతున్న నాగరాజు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని దక్షణభారత ప్రకృతి వ్యవసాయ శిక్షణా నిపుణుడు బసన్‌పల్లి టి. నాగరాజు తెలిపారు. ఆదివారం కుటాగుళ్ల మున్సిపల్ హైస్కూల్ మహావతారం బాబాజీ కాంతి జ్ఞానకేంద్రం, ఎర్త్ 360 స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులు, పురుగుమందుల ప్రభావం తగ్గించేందుకు, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పెంపొందించేందుకు ప్రకృతి వ్యవసాయమే మార్గం అన్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు, వాతావారణం నెలకొంటుందన్నారు. రసాయనిక ఎరువుల వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, భూసారం తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి, మండల ఏఓ శ్రీనివాసరెడ్డి, ఎర్త్ 360 స్వచ్ఛంద సంస్థ దినేష్, రెడ్స్ భానుజా, వాసన్ ప్రోగ్రామ్ అధికారి ఉత్తప్ప, శైలజా, గంగాధర్‌నాయక్, ఆదర్శరైతు వెంకటరెడ్డి, రైతు సంఘం శంకర్, ప్రతాప్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పశువుల సంత ఆదాయం రూ.4.05 లక్షలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశువుల సంతతో రూ.4.05 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2,17,600, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ. 1,87,800 వచ్చిందని తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అలంకరణ, అర్చనలు చేశారు. మాఘమాసం మొదటి ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనం కోసం తరలివచ్చారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలోఅన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి బాబు, ప్రధాన అర్చకులు రాముస్వామి తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల ఆగ్రహం

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అట్రాసిటి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని పలువురు వక్తలు ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి అధ్యక్షత వహించిన సమావేశానికి సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, మానవహక్కుల వేదిక సుబ్బన్న, విజిలెన్స్ మానటిరంగ్ చిరంజీవి, ఓపీడీఆర్ ప్రకాష్, జీవీఎస్ మల్లికార్జున నాయక్, రైట్స్ ఫోరం బాలపెద్దన్న, ఎరుకల హక్కుల పోరాటసమితి ఉమామహేశ్వరి వక్తలుగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పలుసంఘాల నాయకులు రామకృష్ణ, రాజు, శ్రీహరి, వినయ్, వన్నూరుస్వామి, నారాయణస్వామి, వెంకటేష్, నాగేంద్ర తదితరులు పాలల్గొన్నారు.

ఏటా జాబ్ క్యాలెండర్ ఎక్కడ?

- వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేసి ఉద్యోగులు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం వాటిని మరిచిందని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ విమర్శించారు. ఆదివారం గుత్తిరోడ్డులోని కనకదాస కళ్యాణమండపంలో వైసీపీ యువజన విభాగం నేతల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో సాకే చంద్రశేఖర్ మాట్లాడారు. వెంటనే జ్యాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో యువత సత్తా ప్రభుత్వానికి తెలియజెప్పేలా భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. యువజన విభాగం నియో జకవర్గాల అధ్యక్షులు శ్రీనివాస్‌దత్తా, అబ్దుల్ బషీద్, చరణ్, రవి, సురేష్, లోక్‌నాథ్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి: సీపీఐ

రాప్తాడు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను నిలిపివేసి, ఆయకట్టుకు సాగు నీరు సరఫరా చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ డిమాడ్‌చేశారు. ఈ మేరకు మంగళవారం హంద్రీనీవా కార్యాలయం వద్ద చేపట్టే దర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాప్తాడులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం సీపీఐ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. హంద్రీనీవా కార్యాలయం వద్ద మంగళవారం చేపట్టే ధర్నాకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, ఇతర వామపక్ష నాయకు లు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వన్నారెడ్డి, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి కేంద్రం మరోసారి మొండిచేయి : సీపీఎం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి మొండి చేయి చూపారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ముత్తుజ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్ ఖండ్ తరహా నిధులు ఇస్తామని గతంలో ఇచ్చిన హామీ కూడా నిలబెట్టుకోలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసే బడ్జెట్‌ను ప్రజలందరూ తిరస్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నగర నాయకులు వలి, మసూద్, గోపాల్, వెంకటేశు, బుల్లే రాజు, ఓబులేసు, లతీఫ్, ఆజాము, షరీఫ్, హాజీవలి, ఇస్మాయిల్, శంషాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లఘుచిత్ర వారోత్సవాలు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అనంతపురం షార్ట్‌ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో జనవరి 27 నుంచి నిర్వహిస్తున్న 7వ అనంత లఘుచిత్ర వారోత్సవాలు ఆదివారం సాయంత్రం అట్టహాసంగా ముగిశాయి. జిల్లా కేంద్రంలోని అనంత కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ముగింపు సభలో సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా మాట్లాడారు. వారోత్సవాల్లో ప్రదర్శించిన లఘుచిత్రాలకు సంబంధించి ఉత్తమ చిత్రం, డైరెక్టర్, హీరో, హీరోయిన్, విలన్, కెమెరామెన్, ఎడిటర్ విభాగా ల్లో అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డిస్కవర్ అనిల్‌కుమార్, జీఎంఎస్ గ్యాలరీ సురేష్‌కుమార్, యాంకర్ రమేష్ నీల్, తోట బాలన్న, గోపాలకృష్ణ, కంబదూరి షేక్ నబిరసూల్ పాల్గొన్నారు.

జామతోటకు నిప్పు



కాలిపోయిన జామతోటను చూపుతున్నరైతు

కనగానపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని దాదులూరులో ప్రమాదవశాత్తు జామతోటకు నిప్పంటుకుని రూ.4 లక్ష వరకు నష్టం వాటిల్లిన్నట్లు బాధిత రైతు తెలిపారు. మండలపరిధిలోని చంద్రాచర్ల గ్రామానికి చెందిన రాయపాటి శ్రీరాములు అనే రైతుకు దాదులూరు వద్ద నాలుగెకరాల పొలం ఉంది. అందులో ఐదేళ్లుగా జామతోటను సాగు చేస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి రోడ్డు పక్కన నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి తమ జామతోట కాలిపోయిందని రైతు తెలిపాడు. పిందె దశలో ఉన్న చెట్లతోపాటు డ్రిప్పు పరికరాలు కాలిపోయాయని వాపోయాడు.

దారి లోనే... 108 వాహనాల మరమ్మతులు

- సమీపంలోనే నివాస గృహాలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- దుర్వాసన, దోమలతో స్థానికులకు ఇబ్బందులు



రహదారిపై వాహనాలను నిలిపిన దృశ్యం

రాప్తాడు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అత్యవసర సేవకు వినియోగించే 108 వాహనాలు తరచూ మరమ్మతులకు వస్తున్నాయి. జాతీయ రహదారి పక్కన ఇళ్ల వద్ద వాటికి మరమ్మతులు చేస్తున్నారు. రాప్తాడులోకి వెళ్లే రహదారిలో నిలిపి మరమ్మతులు చేస్తుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. వాటి మరమ్మతులు ఊరిబయట పెట్టుకోవాలని పం చాయతీ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తిరిగే 108, 104 వాహనాల మరమ్మతులను రాప్తాడులో నిర్వహిస్తున్నారు. 44వ జాతీయ రహదారి నుంచి రాప్తాడు గ్రామంలోకి వెళ్లే రహదారి వద్ద వాటికి మరమ్మతులు చేస్తున్నారు. దారి మధ్యలో వాహనాలను నిలిపి గంటల కొద్దీ మరమ్మతులు చేస్తుండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి ఇవి అడ్డుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరిగుతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

వేరే చోటికి మార్చాలి



రహదారిపై మరమ్మతులు చేస్తున్న దృశ్యం

108 వాహనాలు మరమ్మతుల ప్రక్రియను మరో ప్రాంతానికి మార్చాలని స్థానిక ప్రజలు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వాహనాలకు ఇక్కడ మరమ్మతులు చేస్తుండటంతో ఆ దారిలో వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని ప్రజలు అంటున్నారు. అంతేగాకుండా వాటి వ్యర్థాల తో దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం పాలవుతు న్నారని స్థానికులు, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు పంచా యతీ సర్పంచ్ సాకే తిరుపాలకు, కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు...108 వాహనాల మరమ్మతులను ఇతర ప్రాంతానికి మార్చాలని అధికారులు మూడు సార్లు నోటీసులు అందించారు. రాప్తాడు సమీపంలోని ఆటో నగర్‌లో మరమ్మతులు చేసుకోవాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శివకృష్ణ కూడా మరో చోటికి మార్చాలని నోటీసు ఇచ్చారు.

వేరే ప్రాంతానికి తరలించాలి



108 వాహనాల మరమ్మతులు ఇతర ప్రాంతాలకు మార్చాలి. ఇక్కడ మరమ్మతులు చేస్తుండటంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. దారిలో వాహనాలు నిలబెట్టి మరమ్మతులు చేస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది.

\- తిమ్మప్ప, రాప్తాడు

అధికారులు చర్యలు తీసుకోవాలి



గ్రామంలో ఇళ్ల వద్ద 108 వాహనాల మరమ్మతులు చేస్తున్నారు. దీంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి వాహనాల మరమ్మ తులు ఊరి చివర్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉన్నచోటికి మార్చాలి.

\- బీరన్న, రాప్తాడు

నోటీసులు అందించాం

108 వాహనాలు అక్కడ మరమ్మతులు చేస్తుండటంతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు. అక్కడ వాహనాల మరమ్మతుకు పంచాయతీ అనుమతి తీసుకున్నట్లు కూడా రికార్డుల్లో లేదు. మరమ్మతులు చేసే ప్రాంతాన్ని మార్చాలని రెండు సార్లు నోటీసులు ఇచ్చాం. త్వరలోనే మారుస్తాం.

\-ప్రేమ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, రాప్తాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

వాహనాలు అక్కడ మరమ్మతులు చేస్తుండటం వలన వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పంచాయతీ అధికారులు మా దృష్టికి తెచ్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం.

\-తిరుపతి నాయుడు, 108 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



బాలాంజినేయులు, సాకే శివానందను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఆదివారం19వ డివిజన్ కార్పొరేటర్, వైసీపీ నాయకుడు బాలాంజినేయులు, చేతన్ కళ్యాణ్ మీడియా వర్క్స్ అధినేత సాకే శివానంద టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. స్థానిక రహమత్ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ మైనార్టీ రాష్ట్ర నాయకులు జకీవుల్లా ఆధ్వర్యంలో 40వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు, అమ్మ ఫౌండేషన్ అధినేత రియాజ్‌తో పాటు 400 మంది టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి సాదరంగా స్వాగతించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి టీడీపీలో చేరినట్లు వైసీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ... బాలాంజినేయులు, రియాజ్, ఇతర వైసీపీ నాయకులు పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. వైసీపీలో కీలకంగా పనిచేసిన వారికి అక్కడ తగిన గుర్తింపు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వారంతా టీడీపీలోకి వచ్చారన్నారు. వైసీపీ హయాంలో కార్పొరేటర్లకు కనీసం వారి డివిజన్లలో అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వలేదన్నారు. వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. క్రమ శిక్షణ కలిగిన టీడీపీలో బీసీ, మైనార్టీ నాయకులకు తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగారామ్, పోతుల లక్ష్మీనరసింహులు, సుధాకర్ యాదవ్, కూచి హరి, ముక్తియార్, ఇస్మాయిల్, సింగవరం రవి తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలను హింసిస్తే కఠిన చర్యలు: డీడీ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మూగజీవాలను హింసించే వారిపై జంతు క్రూరత్వ నిరోధక చట్టం 1960 కింద కఠిన చర్యలు తీసుకుంటామని పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. వసంత పంచమిని పురస్కరించుకుని పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఇస్కాన్ గోశాలలో 'జీవజంతు కళ్యాణ దివస్'ను నిర్వహించారు. గోశాలలోని గోవులకు, దూడలకు అవసరమైన మందులను గోశాల ఇన్‌చార్జ్ సుదర్శన్‌కు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ పద్మనాభం, గోశాల ప్రతినిధులు సుదర్శన్, పద్మనాభదాస్, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపర్లను అలరించాయి. శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నగరానికి చెందిన శ్రీ నృత్య కళాకేంద్రం నృత్యగురువు సంధ్యామూర్తి ఆధ్వర్యంలో పలు ప్రదర్శన లు చేశారు. ఈ ప్రదర్శనలు చూపర్లను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శిల్పారామం ఏఓ క్రిష్ణప్రసాద్, నృత్య కళాకారులు నితీష, నివాన్షి, భార్గవి, దీక్షిత, హర్షవర్ష, మాన్విత, వైష్ణవి, హిమవర్ష, మేఘన, వేదాన్విత, దర్శిని, హిమశ్రీ పాల్గొన్నారు.

నాలుగు గంటల్లోనే హార్సిలీహిల్స్ అధిరోహణ



శిఖరంపై జాతీయ, ఎన్‌సీసీ పతాకాలను ఎగురవేస్తున్న క్యాడెట్లు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్ శిఖరానికి నాలుగు గంటల వ్యవధిలోనే ట్రెక్కింగ్(కాలినడక) ద్వారా చేరుకున్న జేఎన్టీయూ అనుబంధ మిట్స్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు సరికొత్త రికార్డును సృష్టించారు. లెఫ్టినెంట్ నవీన్‌కుమార్ శిక్షణపొందిన వందమంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ రికార్డును సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. దేశరక్షణకు అత్యవసర సమయాల్లో సేవలందించేలా రోప్ హ్యాండ్లింగ్, హిల్ క్లింబింగ్ వంటి కఠిన అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నవీన్‌కుమార్‌తోపాటు ఆంధ్ర బెటాలియన్-35 హవల్దార్ నందన్‌రామ్, హవల్దార్ మదన్ ట్రెక్కింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు.

6 నుంచి ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఈ నెల 6వ తేదీ నుంచి అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.దేశంలో విద్య, వైద్యం వ్యాపారంగా మారిందంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి, సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలుచేయాలన్నారు. ఈనెల 6, 7, 8, 9 తేదీల్లో జరిగే మహాసభల్లో యువత, సీపీఐ శ్రేణులు భారీగా పాల్గొనాలని కోరారు.

ఉత్సాహంగా 'వీ రన్'



యువతతో కలిసి స్టెప్పులేస్తున్న ఎమ్మెల్యే, శాప్ చైర్మన్



పరుగు తీస్తున్న యువత







గ్రీన్ టీషర్టులు ధరించి రన్‌కు హాజరైన యువత

సమష్టి కృషితోనే క్రీడాభివృద్ధి

- ఆర్డీటీతో కలిసి పనిచేసేందుకు ప్రణాళిక
- శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు



ఆర్డీటీ స్టేడియాన్ని పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, ఆర్డీటీ కలిసి సమష్టిగా కృషి చేస్తే క్రీడారంగాన్ని మరింతగా అభివృద్ధి చేయవచ్చని ఏపీ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారఆయన ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియాన్ని పరిశీలించారు. స్టేడియం నిర్మాణం, సదుపాయాలు, క్రీడా అకాడమీలను, హాస్టళ్లను పరిశీలించిన అనంతరం క్రీడాకారులతో మాట్లాడి సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ మాట్లాడుతూ ఆర్డీటీ స్టేడియంలో అత్యాధునిక హంగులు, అంతర్జాతీయ క్రీడాప్రమాణాలు, సదుపాయాలు చాలా బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటువంటి ఆర్డీటీతో కలిసి రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు. క్రీడల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా ఉన్నాయన్నారు. ఏపీ నుంచి అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయడమే సీఎం చంద్రబాబు ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్డీటీ సేవలు విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్లు సాయికృష్ణ, వంశీకృష్ణ, యుగంధర్‌రెడ్డి, శ్రీనివాసులు, డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, కోచ్‌లు పాల్గొన్నారు.

అనంత ఉద్యాన సమ్మేళనానికి హాజరు కండి

- ఎమ్మెల్యే పరిటాల సునీతకు అధికారుల ఆహ్వానం



ఎమ్మెల్యే పరిటాల సునీతను ఆహ్వానిస్తున్న ఉద్యాన అధికారులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 5వ తేదీ జరిగే అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యే పరిటాల సునీతను ఉద్యాన అధికారులు కోరారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఉద్యాన అధికారి నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్, ఉద్యాన అధికారి రత్నకుమార్ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

దుప్పట్ల పంపిణీ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిస్సహాయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్, శ్రీకంఠం సర్కిల్, సప్తగిరి సర్కిల్, పాతూరు తదితర ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న నిస్సహాయులకు ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి చేతులమీదుగా ఆదివారం దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

వైన్‌షాపుల కోసం దరఖాస్తు చేసుకోండి


- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



కల్లుగీత కార్మికులతో సమావేశమైన ఎక్సైజ్ అధికారులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కల్లు గీత కార్మికులు మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య కోరారు. స్థానిక అనంతపురం ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఆయన అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, సీఐ సత్యనారాయణలతో కలిసి కల్లుగీత కులస్తులతో సమావేశమయ్యారు. కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల ఐదో తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉందన్నారు. ఏడో తేదీ కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తామన్నారు. జిల్లాలో 14 మద్యం షాపులను కల్లుగీత కార్మికులైన ఈడిగ, గౌడ్, గౌడ, గౌండ్ల, కళాలి కులస్థులకు కేటాయించినట్లు తెలిపారు. ఈడిగకు 9, గౌడ్‌కు 2, గౌడ, గౌండ్ల, కళాలి కులస్థులకు ఒక్కొక్కటి చొప్పున దుకాణాలు కేటాయించామన్నారు. ఈడిగ కులస్థులు గుంతకల్లు, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలు, కంబదూరు, గుమ్మఘట్ట, గుంతకల్లు రూరల్, రాప్తాడు, బెళుగుప్ప మండలాల్లో దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గౌడ్ కులస్థులు అనంతపురం నగర పాలక సంస్థ, గుత్తి రూరల్ మండలంలోని దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గౌడ రాయదుర్గం రూరల్, గౌండ్ల కులస్థులు డి.హీరేహాళ్, కళాలి కులస్థులు తాడిపత్రి మున్సిపాలిటీలోని దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాకు చెందిన వారే దరఖాస్తుకు అర్హులన్నారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు నాన్‌రీఫండబుల్ దరఖాస్తు ఫీజు చెల్లించాలన్నారు. కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐలు జయనరసింహ, జాకీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెటరన్స్ క్రికెట్ పోటీల విజేత ఏపీ



విజేతగా నిలిచిన ఆంధ్రా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ వెటరన్స్ క్రికెట్ పోటీల విజేతగా ఆంధ్రప్రదేశ్ జట్టు నిలిచింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో జరుగుతున్న ఆర్‌వీకే మెమోరియల్ సౌత్‌జోన్ వెటరన్ క్రికెట్ పోటీలలో భాగంగా ఆదివారం ఫైనల్స్ నిర్వహించారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసింది. ఇందులో ప్రవీణ్ 38, ఎల్జార్ 32 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన తమిళనాడు జట్టు 19.3 ఓవర్లలో 106 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. ఇందులో సురేష్ 29, ఎస్వీ నాథన్ 26 గౌరవప్రదమైన పరుగులు చేశారు. కీలక సమయంలో మూడు వికెట్లు తీసిన ఆంధ్రా బౌలర్ సందీప్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా ఆంధ్రా ప్లేయర్ భరత్ కుమార్ కు దక్కిందింది. విజేతగా నిలిచిన ఆంధ్రాజట్టుకు, రన్నరప్ తమిళనాడు జట్టుకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ మెంబర్ ప్రసన్నకుమార్, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఇంచార్జి సెక్రెటరీ భీమలింగారెడ్డి, ఏసీఏ సౌత్‌జోన్ మేనేజర్ సాగర్‌చౌదరి, జిల్లా వెటరన్ క్రికెట్ డైరెక్టర్ నాగప్ప, అధ్యక్షుడు కృష్ణమోహన్, సెక్రటరీ మధుకర్, వీఎస్ పటేల్, నగేష్, ఆర్ఎస్ఆర్ మూర్తి, షబ్బీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బ్రహ్మోత్సవాల పోస్టర్ల విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయరాం తదితరులు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో గల బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కర్నూలు జిల్లా ఆలూరులో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 6వ నుంచి 14వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, వేలాది భక్తులు హాజరవుతారని, వారికి ఎలాం టి అసౌకర్యమూ కలగకుండా చూడాలని ఈఓ రామాంజనేయులుకు సూచించారు. 12వ తేదీన ఉదయం స్వామి వారి కల్యాణం, సాయంత్రం రథోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్, అర్చకులు, గ్రామస్థులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

550 చీనీచెట్లు దగ్ధం



కాలిపోయిన చీనీచెట్లు

బెళుగుప్ప, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామంలో మహిళా రైతు శిల్పకు చెందిన తోటలో 550 చీనీ చెట్లు, డ్రిప్ పరికరాలు ఆదివారం అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. విద్యుత్ తీగలు రాసుకుని మంటలు చెలరేగడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు బాధిత రైతు బంధువులు వెంకటేశులు, రమేష్ తెలిపారు. తోటలో చెట్లపైనే విద్యుత్ తీగలు వేళాడుతున్నాయని, గాలులకు అవి ఒకదానికొకటి రాసుకోవడంతో మంటలు చెలరేగాయని చెప్పారు. విద్యుత్ తీగల వల్ల ప్రమాదం పొంచిఉందని, వాటిని తొలగించాలని ఇదివరకే పలుమార్లు సంబంధితాధికారులకు విన్నవించామని, అయినా ఎవరూ పట్టించుకోలేదని వారు వాపోయారు. కోతకొచ్చిన పంటతోపాటు డ్రిప్ పరికరాల అగ్నికి ఆహుతవడంతో రూ.పది లక్షలకుపైగా నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాని కోరారు.

శెట్టూరులో జీవజంతు కళ్యాణ దివస్

శెట్టూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశువైద్యశాలలో ఆదివారం జీవజంతు కళ్యాణ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పశువైద్యుడు లింగేశ్వరరెడ్డి తెలిపారు. ప్రతిఒక్కరికీ జంతువుల పట్ల ప్రేమ, కరుణ, దయ కలిగి ఉండాలన్నారు. వాటికి తగినంత నీరు, ఆహారం, టీకాలు అందించాలని సూచించారు. పశు ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు పశువైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

శెట్టూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రఘురామారావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్ కింద మండలానికి 34 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. అలాగే ఈ బీసీలకు రెండు, కమ్మ కార్పొరేషన్‌కు ఒకటి, బీసీ జనరిక్ మెడికల్ దుకాణానికి ఒకటి, కాపు కార్పొరేషన్‌కు ఏడు యూనిట్ల చొప్పున మంజూరయ్యాయన్నారు. అర్హులు ఈనెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా కలశ ప్రతిష్ఠ

బెళుగుప్ప, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ గోపురంపై ఆదివారం వేదపండితులు వేద మంత్రోచ్చారణల నడుమ కలశ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆలయంలో ఆర్యవైశ్య ఆడపడుచులకు వడిబియ్యం కార్యక్రమం, తత్వ హోమం, కలశ హోమం చేపట్టారు.

మడివాళ మాచిదేవ స్వామి ఉత్సవాలు

కుందుర్పి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిజవళ్లి గ్రామంలో శనివారం మడివాళ మాచిదేవ స్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మడివాళ కులస్థులు, గ్రామపెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని మాచిదేవస్వామి చిత్రపటాన్ని వాహనంలో వుంచి పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కలశాలతో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు రాఘవేంద్రబాబు, మాజీ కోఆప్షన్ సభ్యుడు తాహిర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గుండు నాగప్ప విగ్రహ ప్రతిష్ఠ

కూడేరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రకోడు సమీపంలో గుండు నాగప్ప విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయమే అర్చకులు ఆలయ ఆవరణలో నాగప్ప స్వామి విగ్రహాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ చేశారు. భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

యాడికి, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకుని రాయలచెరువులోని సరస్వతీ విద్యామందిరంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం మంజుల ఆదివారం తెలిపారు. ఆసక్తిగల చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిభను వెలికి తీసేందుకే మోడల్ డీఎస్సీ టెస్ట్

● ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల్లో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి వారిలో ప్రతిభను వెలికి తీసేందుకే మోడల్ డీఎస్సీ పరీక్షను నిర్వహించామని ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ తెలిపారు. ఇటీవల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ డీఎస్సీ పరీక్ష ఫలితాలను ఆదివారం ఆయన పట్టణంలోని ట్రస్టు కార్యాలయంలో విడుదల చేశారు. టాప్‌లో 80 మార్కులకు గాను 57.5 మార్కులతో బోయ వీణ ఫస్ట్ ర్యాంకు, 55.5 మార్కులతో జే.జ్యోతి రెండో ర్యాంకు, 55 మార్కులతో తిమ్మప్ప మూడోర్యాంకు సాధించారని అన్నారు. అభ్యర్థుల్లో ప్రతిభను వెలికి తీసి ఉద్యోగాలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రయోగాత్మకంగా తమ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ మోడల్ డీఎస్సీ పరీక్ష నిర్వహించామని అన్నారు. విజేతలకు ప్రైజ్‌మనీని ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేస్తామని చెప్పారు.



మోడల్ డీఎస్సీ ఫలితాలను చూపుతున్న ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్



వాహనాలు వెళ్తుంటే దుమ్ము లేస్తున్న దృశ్యం



దుమ్ముధూళితో నిండిపోయిన రోడ్డుపక్కనున్న మారెమ్మకట్ట

దుమ్ముధూళితో నరకయాతన

● తిమ్మాపురం సమీపంలో రోడ్డుపై కంకర డస్టు వేసి.. తారు మరచిన అధికారులు

● ఏడాది అవుతున్నా పట్టించుకోని వైనం

● దుమ్ముధూళితో నరకం చూస్తున్న స్థానికులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అంకోలా- నెల్లూరు జాతీయ రహదారి మండలంలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో వెళ్తోంది. ఆ గ్రామ సమీపంలో రోడ్డుపై తారు వేయడానికి గాను ఏడాది క్రితం కంకర డస్టు వేశారు. కాగా ఇంతవరకు తారు వేయడం మరిచారు. దీంతో వాహనాలు వచ్చిపోయే సమయాల్లో విపరీతమైన దుమ్ముధూళి వస్తుండడంతో రోడ్డు ఇరుపక్కల నివాసం ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 30 ఏళ్ల నుంచి గ్రామ సమీపంలో 15 కుటుంబాలు నివసిస్తున్నాయి. అక్కడ ఏడాది క్రితం ఆర్‌అండ్ బీ అధికారులు తారురోడ్డు వేసేం దుకు చదును చేసి డస్ట్ కంకర వేశారు. అనంతరం మళ్లీ పట్టించుకోలేదు. దీంతో వాహనాలు వెళ్లిన ప్రతిసారీ దుమ్మూధూళి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లలోకి వెళ్తోంది. దీనివల్ల నిత్యం తలుపులు వేసుకుని ఉంటున్నామని అక్కడి మహిళలు వాపోతున్నారు. దుమ్మూధూళితో కొంత మంది చర్మ, శ్వాసకోస వ్యాధులకు గురవుతున్నారని అంటున్నారు. తారు వేయకపోవడంతో మారెమ్మ కట్ట వద్ద, మున్సిపల్ ఓవర్ హెడ్ ట్యాంకు మలుపు వద్ద రోడ్డుకు సైతం గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు కూడా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తారు వేయాలని ఆ గ్రామప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

దుమ్ముధూళితో అలెర్జీ సోకింది



ఆరు నెలల నుంచి దుమ్ము, ధూళి వల్ల తన రెండు చేతులకు అలెర్జీ సోకింది. ప్రైవేట్ ఆసుపత్రిలో రూ. 15వేలు ఖర్చు చేసి చూపించినా తగ్గడం లేదు. ఇక మందులు కొనడానికి డబ్బు లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నాను.

\- లక్ష్మీదేవి, తిమ్మాపురం

శ్వాససమస్యతో బాధపడుతున్నా



రోడ్డులో వాహనాలు వెళితే కంకర డస్ట్ వల్ల దుమ్మూధూళి ఇంట్లోకి వస్తోంది. దీంతో ఇంటి ఆవరణం మొత్తం దుమ్ముతో నిండి పోతోంది. ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టలేక పోతున్నాం. ఎప్పుడూ తలుపులు వేసుకొని ఇంట్లోనే కూర్చుంటున్నాం. దుమ్మూధూళి వల్ల ఆరు నెలల నుంచి శ్వాస సమస్యతో బాధపడుతున్నాను.

-మల్లేశ్వరి, తిమ్మాపురం

ఇంటికి తాళం వేసి బయటకు వెళ్తున్నాము



దుమ్ము వల్ల రోజూ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్తున్నాం. చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. చేతులకు స్కిన్ అలర్జీ వచ్చింది. రోజు విడిచి రోజు ఆసుపత్రికి వెళ్తున్నాను. ఇంకేన్నాళ్లు ఈ పరిస్థితి ఉంటుందో అర్థం కావటం లేదు.

-లక్ష్మీ, తిమ్మాపురం



అగ్నికి ఆహుతవుతున్న శెట్టూరు అటవీ ప్రాంతం



కుందుర్పి మండలం ఎనుములదొడ్డి అటవీ ప్రాంతంలో వ్యాపిస్తున్న మంటలు

అడవిలో చెలరేగిన మంటలు

● చెట్లు, వన్యప్రాణులు ఆహుతి

శెట్టూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి గొల్లపల్లి అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో అడవిలోని చెట్లు, మొక్కలు కాలిపోయాయి. గోరి తిప్ప ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరగడం వల్ల బసంపల్లి నుంచి శెట్టూరుకు వెళ్లే ప్రధాన రహదారి వరకు అడవిలో మంటలు చెలరేగాయి. దీంతో సుమారు ఆరు ఎకరాలపైగా విస్తీర్ణంలో చెట్లు, మొక్కలు కాలిపోయాయి. వన్యమృగాలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. అటుగా వెళ్లేవారు అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు.

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డి అటవీప్రాంతానికి ఆదివారం గుర్తు వ్యక్తులు నిప్పు పెట్టారు. అడవిలో ఇన్నాళ్లుగా... వేలాది మొక్కలను అటవీ అధికారులు సంరక్షిస్తూ వచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి కూడా ఏపుగా పెరిగింది. దీంతో గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు చెలరేగి ఆ చెట్లన్నీ కాలిపోయాయి. అటవీ ప్రాంతంలోని చెట్లతో పాటు కొండకు కూడా మంటలు వ్యాపించాయి.



యాడికిలో కలిసిన పూర్వ విద్యార్థులు ..



బెళుగుప్పలో..

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యాడికి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆ పాఠశాలలో 1981-1982వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మళ్లీ సుమారు 42ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులు భాస్కర్‌రెడ్డి తదితరులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. చాలామంది తమ మనవళ్లు, మనవరాళ్లతో హాజరుకావడం గమనార్హం. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ఆనంద్, మోహన్, గంగరాజు, చంద్రమోహన్, భోగేశ్వర్‌రెడ్డి, శశిధర్, శ్రీధర్, రామ్మోహన్, మద్దాల భాస్కర్, సంజీవరెడ్డి, చంద్రహాస్‌రెడ్డి, వాసు, వనజ, స్వర్ణమంజుల, నారమ్మ తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు అదే పాఠశాలలో గెట్‌టుగెదర్ నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. గురువులను సన్మానించారు. చదువుకున్న బడి రుణం తీర్చుకుందాంలో భాగంగా రూ. 6లక్షల వ్యయంతో నిర్మించిన సమావేశ వేదికను ప్రారంభించారు. అలాగే సరస్వతీదేవి, వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎంఈఓ మల్లారెడ్డి, హెచ్‌ఎం వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ చోరీ కేసులో మరో నలుగురి అరెస్టు

తాడిపత్రి, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారిచెరువు సమీపంలో ఉన్న అదాని సిమెంట్స్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న పయనీర్ ట్రాన్స్‌పోర్ట్ గ్యారేజీలో రెండురోజులక్రితం జరిగిన డీజల్ దొంగతనం కేసులో పారిపోయిన నలుగురు దొంగలను ఆదివారం అరెస్టు చేశామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 1న గ్యారేజీలో నిలిపి ఉంచిన లారీల్లోంచి ఏడుగురు వ్యక్తులు బొలెరో వాహనంలో వచ్చి 40లీటర్ల డీజిల్‌ను అపహరించుకుని వెళ్తుండగా ముగ్గురిని అక్కడి సెక్యూరిటీ గార్డు పట్టుకున్నాడన్నారు. మరో నలుగురు వ్యక్తులు పారిపోయారని, అందిన సమాచారం మేరకు నంద్యాల జిల్లా సంజాముల మండలం రామిరెడ్డిపల్లికి చెందిన వెంకటేష్, నాగేంద్ర, మల్లి, చంద్రలను సజ్జలదిన్నె గ్రామశివారులో అరెస్టు చేశామని సీఐ చెప్పారు.

ముగ్గురిపై కేసు నమోదు

యాడికి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాయలచెరువులో ఇంటివద్ద గోడ విషయంలో గొడవపడ్డ సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ వెంకటరమణయ్య తెలిపారు. గత జనవరి 27న రాయలచెరువులో ఇంటిగోడ విషయంలో శేఖ ర్, మల్లికార్జున గొడవపడ్డారు. మల్లికార్జునపై శేఖర్, చిన్న సంజీవరాయుడు, రామాంజనేయులు కలిసి దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేశాడని, దీంతో నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కింద పడి గర్భిణి మృతి



వసంత (ఫైల్)

విడపనకల్లు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లులో వసంత(28) అనే 8నెలల గర్భిణి ఆదివారం ప్రమాద వశాత్తూ కింద పడి మృతి చెందింది. గ్రామంలో తమ ఇంటిలో గర్భిణి వసంత పనులు చేసుకుంటూ ప్రమాద వశాత్తు కింద పడి పోయింది. అక్కడే ఉన్న ఏఎన్ఎం సుగుణ వెంటనే వచ్చి చికిత్స అందించింది. ఊపిరి ఆడక పోవటంతో సీపీఆర్ నిర్వహించారు. అనంతరం కొట్టాలపల్లి వైద్యుడు శ్రీకాంత్ సలహా మేరకు గుంతకల్లు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. గర్భిణీ మృతిపై గ్రామస్థులు అసహనం వ్యక్తం చేశారు. గ్రామంలో సబ్‌సెంటర్ సరిగా లేక పోవటంతో గర్భిణిలకు సరైన వైద్య సేవలందటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై వైద్యుడు శ్రీకాంత్‌ను వివరణ కోరగా వసంత ఆరోగ్యంగా ఉందన్నారు. అయితే ఆమె మృతిపై విచారించి కారణాలు తెలుసుకుంటామమని అన్నారు.

విషపు నీరు తాగి రెండు గేదెల మృతి

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని దొడఘట్ట గ్రామంలో ఆదివారం విషపు నీరు తాగి రెండు గేదెలు మృతి చెందాయి. బాధిత రైతు తలారి కావెళ్లప్ప మాట్లాడుతూ.. ఉపాధి కోసం దాదాపు రూ. లక్ష అప్పు చేసి రెండు గేదెలను కొనుగోలు చేసి వాటితోనే జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ క్రమంలో యథావిధిగా వాటిని మేత కోసం అడవికి తీసుకెళ్లామన్నారు. అక్కడ ఓ వ్యవసాయ తోటలో విషపునీరు తాగి మృతి చెందాయని ఆవేదన చెందారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం గ్రామంలో ఆదివారం వీధికుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. గ్రామంలోని బీసీకాలనీలో సాయం త్రం ఇంటి బయట ఆడుకుంటున్న స్నేహ, లత అనే ఇద్దరి చిన్నారులపై వీధికుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు గమనించి వాటిని చెదరకొట్టి చిన్నారులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో 500 పైగానే వీధి కుక్కలు ఉన్నాయని, వాటిని నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఈ దారి అంతా.. దుర్గంధం

● మురుగునీటితో నిండి కంపుకొడుతున్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రోడ్డు

● నడవడానికి కూడా వీలులేకుండా ఉన్న వైనం

● ఇబ్బంది పడుతున్న స్థానికులు

విడపనకల్లు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారి మురుగు నీటితో నిండి కనీసం నడవటానికి వీలు లేకుండా మారిపోయింది. గ్రామంలోని ప్రధాన దారుల్లో ఇది ఒకటి. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే ఇక్కడి నుంచే వెళ్లాలి. ఎంతో మంది అధికారులు ఈ దారి వెంట నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై కనీసం మట్టి వేసి మురుగు నీరు లేకుండా చేయించే ఏర్పాట్లు చేయలేదు. స్థానిక దుబ్బా పీరా ఇంటి వద్ద నుంచి బజారు లక్ష్మినారాయణ ఇంటి వరకూ నడిచేందుకు వీలు లేకుండా రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తూ ఉంటుంది. ఈ దారి వెంట కాలి నడకన కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఇక్కడ డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరంతా రోడ్డుపై పారుతోంది. ఈ మురుగు నీటి నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామని ఈ వీధిలో నివాసం ఉండే ప్రజలు వాపోతున్నారు. ఇక సాయంత్ర దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. సంబంధితాధికారులు రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పోలీసులు తిరిగే దారినే ఏ ఒక్క అధికారీ పట్టించుకోలేదు.. ఇంక వేరే దారుల పరిస్థితి ఏంటోనని వారు నిట్టూర్పుతున్నారు.



మురుగునీటితో నిండివున్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారి

నిట్టూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి

● ట్రాన్స్‌కో అధికారుల తీరుపై రైతుల నిరసన

యాడికి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోరుబావులకు కరెంట్ సరఫరాలో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పలువురు రైతులు మండలంలోని నిట్టూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆదివారం ముట్టడించారు. ఈ సందర్భంగా అక్కడకు చేరుకున్న ట్రాన్స్‌కో ఏఈ రాజారావుతో వాగ్వాదానికి దిగారు. నిట్టూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయ బోరుబావులకు అధికారులు ఇష్టారాజ్యంగా కరెంట్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. అర్ధరాత్రి, తెల్లవారుజామున సమయాల్లో మోటార్లకు కరెంట్ విడుదల చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. వ్యవసాయ బోరుబావులకు 9గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినప్పటికీ స్థానిక అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. కనీసం నాలుగు గంటలు కూడా నిరంతరంగా కరెంట్ సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో పంటలను ఎండబెట్టుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయని మండిపడ్డారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పేరుతో ప్రతిరోజూ వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పరుస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. నిరంతర విద్యుత్ సరఫరాపై కచ్చితమైన హామీ ఇచ్చేంతవరకు కదిలేది లేదని భీష్మించారు. కరెంట్ సరఫరా అంతరాయం లేకుండా చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ సర్దిచెప్పడంతో రైతులు శాంతించారు.

ఏఐవైఎఫ్ మహాసభలకు తరలిరండి



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కొట్రేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏఐవైఎఫ్ నాయకులు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి కణేకల్లు రోడ్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్రేష్ మాట్లాడుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7, 8, 9వ తేదీలలో శ్రీకాకుళం జిల్లాలో రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. జాబ్ క్యాలెండర్ ఎక్కడ, నిరుద్యోగ భృతి హామీ ఏమైందని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రతి ఉద్యోగాన్ని భర్తీ చేస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేసింది లేదని వాపోయారు. డీఎస్సీని కూడా వాయిదా వేశారని విమర్శించారు. ఇప్పటికైనా డీఎస్సీ విడుదల చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల వలంటీర్ల పోస్టులను కూడా భర్తీ చేసి రూ. పదివేల గౌరవ వేతనంతో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షుడు కుమార్, కోశాధికారి నవీన్, సహాయ కార్యదర్శి నాగయ్య, నాయకులు శంకర్, సురేష్, నరేష్, హుస్సేన్, గంగాధర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి మొండిచేయి: సీపీఎం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి మొండిచేయి చూపారని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఆదివారం వారు నిరసన తెలిపారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రైల్వేజోన్, ఎన్ఐటీ, ఐఐటీ, ఐఐఎం, ట్రిపుల్ఐటీ, సెంట్రల్ యూనివర్శిటీ, దుగరాజపట్నంపోర్టు, కడప స్టీల్ ప్లాంట్, వెనుక బడిన జిల్లాలకు నిధులు లేవన్నారు. రాజధాని నిర్మాణానికి నిధుల ఊసేలేదు, రాజధాని నిర్మాణానికి గతంలో ప్రకటించిన ప్రపంచ బ్యాంక్ రుణాన్నే పదే పదే ప్రస్తావించారే తప్ప.. కొత్తగా కేటాయింపులు లేవన్నారు. రాష్ట్ర విజ్ఞప్తులను కూడా కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించాలన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అన్నిపార్టీల ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. ఈ దగాకోరు బడ్జెట్‌ను రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జగ్గలి రమేష్, సాకే నాగరాజు, సురేంద్ర, షబ్బీర్, చంద్ర, ఓబులేసు, రామునాయక్, సూరి, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీ ప్రజల ఆశలను అడియాశలు చేశారని సీపీఎం మండల కార్యదర్శి కోరి నాగరాజు పేర్కొన్నారు. రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేకహోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలను పక్కన పెట్టారన్నారు. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం అవలంబించిన నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు శ్రీధరఘట్టలో కృతజ్ఞత సభ

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో రైతుల నుంచి ప్రభుత్వం పెద్దఎత్తున వరిధాన్యం కొనుగోలు చేస్తోంది. ఇందుకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పెద్దఎత్తున కృషి చేయడంతో రైతులంతా కలిసి ఆయనకు మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో సోమవారం కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ బలరామిరెడ్డి ఆదివారం తెలిపారు. మార్కెట్‌లో ధరల పతనంతో పంట ఉత్పత్తులు అమ్ముకోలేని పరిస్థితి రైతులకు ఎదురైంది. క్వింటాల్ వరిధాన్యానికి రూ. 1850లు కూడా లభించలేదు. దీంతో కనీస మద్దతు ధరపై ధాన్యం సేకరించడానికి కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. అయితే జిల్లా వ్యాప్తంగా కేవలం ఐదు వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు మాత్రమే అనుమతిచ్చింది. దీంతో కాలవ శ్రీనివాసులు 12500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతివ్వాలని గతంలో లేఖ రాశారు. అందుకు సీఎంవో కార్యాలయం స్పందించింది. ఈ నేపథ్యంలో రైతులు కాలువకు కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. కూటమిశ్రేణులు, రైతులు తరలిరావాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ పరీక్షలు

గుత్తి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయి జూనియర్ కళాశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షలు నిర్వహించారు. స్థానిక గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ పాల్గొని పరీక్ష ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టెన్త్ విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలంటే భయం పోగొట్టడానికి ఈ మోడల్ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. 500మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, కళాశాల యాజమాన్యం జయరంగారెడ్డి, కాంతారెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ, నవీన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రేరణ

తాడిపత్రి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని తాడిపత్రి ఇం జనీరింగ్ కళాశాలలో ఆదివారం తాడిపత్రి డివిజన్ పరిధిలోని బీసీ హాస్టళ్లలో ఉంటూ టెన్త్ చదువుతున్న విద్యార్థులకు ప్రేరణ- శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి హాజరై మాట్లాడారు. మార్చి 17వ తేదీ నుంచి 10వ తరగతి పరీక్ష లు ప్రారంభంకానున్నాయని తెలిపారు. ఇప్పటి నుంచి సమయం వృథా చేయకుండా చక్కగా చదువుకోవాలని అన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందు కు వెళ్లాలని తెలిపారు. వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కష్టపడాలన్నారు. అనంతరం క్రియేటర్ కృష్ణ విద్యార్థులకు పరీక్షలపై ఉండే భయాన్ని పోగొట్టేలా చైతన్యపరిచారు. కార్యక్రమంలో తాడిపత్రి అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగమ్మ, ఎంఈఓ నాగరాజు, బీసీ వసతిగృహాల వార్డెన్ల రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, పలువురు వార్డెన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి